జేఎన్‌టీయూలో ప్రపంచస్థాయి సాంకేతిక విద్య

○ మంత్రి దామోదర రాజనర్సింహ

కళాశాల నూతన ప్రారంభించిన బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

పుల్కల్, వెలుగు : జేఎన్‌టీయూలో ప్రపంచస్థాయి సాంకేతిక విద్య అందుతోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం చౌటకూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ఉన్న జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ ఇంజినీరింగ్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కళాశాల బస్సులతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ అండ్ సిమ్యులేషన్ ల్యాబొరేటరీ, స్మార్ట్ కంప్యూటింగ్ ల్యాబొరేటరీ, కంప్యూటర్ అప్లికేషన్స్ ఇన్ ఫార్మసీ ల్యాబొరేటరీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన సాంకేతిక విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సుల్తాన్‌పూర్ క్యాంపస్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ఆధునిక ప్రయోగశాలలు విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంపై ప్రాయోగిక అవగాహన కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను మరింత పెంచుతాయని తెలిపారు. తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ వారు ముందుకు వచ్చి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా కళాశాలలకు రెండు బస్సులను అందించడం అభినందనీయమన్నారు. కొత్తగా ప్రారంభించిన ప్రయోగశాలల్లో సెమీకండక్టర్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అనంతరం సుల్తాన్‌పూర్ క్యాంపస్‌లో ప్రతిపాదిత క్లాక్ టవర్ నిర్మాణ స్థలాన్ని మంత్రి పరిశీలించారు. నిర్మాణ రూపకల్పన, వ్యయ అంచనాలను త్వరగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఆందోల్ క్యాంపస్ నిర్మాణానికి రూ.57 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. భవనాల నిర్మాణానికి సంబంధించిన స్ట్రక్చరల్ డిజైన్‌ను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, జేఎన్‌టీయూహెచ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.దామోదరం, చీఫ్ ఇంజినీర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా. సునీత రెడ్డి, యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. విశ్వనాథ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. రాఘవేందర్ రావు, విభాగాధిపతులు, లెక్చరర్లు, విద్యార్థులు, తోషిబా సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల వైపే టాపర్ల మొగ్గు

- ప్రథమ ర్యాంకర్ సైతం..
- ఎప్‌సెట్ కౌన్సెలింగ్.. జేఎన్‌టీయూహెచ్‌లో 22, ఓయూలో 420తో ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: ఎప్‌సెట్ టాపర్లు రాష్ట్రంలోని వర్సిటీ కళాశాలల కంటే ప్రైవేటు కళాశాలల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇంజినీరింగ్ తొలి విడత సీట్ల కేటాయింపు పరిశీలిస్తే ఇదే స్పష్టమవుతోంది. ప్రథమ ర్యాంకర్ రుషి సైతం ప్రైవేటు కళాశాలలోనే చేరటం గమనార్హం. ముఖ్యంగా ఓయూకు టాపర్లు ఎక్కువగా దూరమవుతున్నట్లు అర్థమవుతోంది. యూనివర్సిటీ కళాశాలల్లో 83.30 శాతం సీట్లు భర్తీ కాగా.. అదే సమయంలో ప్రైవేటులో 91.30 శాతం నిండటం విశేషం. ఈసారి వెయ్యిలోపు ర్యాంకర్లు 196 మందికి సీట్లు దక్కగా వారిలో 80 మందికిపైగా జేఎన్‌టీయూహెచ్‌లో మరో 10 మంది వరకు ఓయూలో ప్రవేశాలు పొందనున్నారు. మిగిలిన వారు ప్రైవేటు కళాశాలల్లో చేరనుండటం గమనార్హం.

ప్రాంగణ నియామకాలే కొలమానంగా..

విద్యార్థులు ప్రాంగణ నియామకాలు, వార్షిక ప్యాకేజీలను కొలమానంగా చూస్తున్నారు. ప్రముఖ ప్రైవేటు కళాశాలల్లో అయితే క్యాంపస్ ప్లేస్‌మెంట్లు ఉంటాయని, అధిక వేతనమిచ్చే టాప్ ఐటీ కంపెనీలను సైతం రప్పిస్తాయని, అంతటి చొరవను వర్సిటీ కళాశాలలు తీసుకోవడం లేదన్న అభిప్రాయం తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రభుత్వ/వర్సిటీ కళాశాలల్లో 70 శాతానికిపైగా ఆచార్యుల ఖాళీలు ఉండటంతో ఆ ప్రభావం టాపర్ల చేరికలపై పడుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇక ఏకైక ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల(కోస్లి)లో కేవలం 28.60 శాతం సీట్లే నిండటం గమనార్హం. అక్కడ విద్యార్థుల్లో అత్యంత డిమాండ్ ఉన్న సీఎస్ఈలోనూ 66కి 39 మాత్రమే నిండాయి.

అధికంగా మిగిలిన సీట్లు..

ఈసారి కూడా సీఎస్ఈ, ఐటీ తదితర బ్రాంచీలకే అధిక శాతం మంది మొగ్గుచూపినా.. గత ఏడాదితో పోల్చుకుంటే ఇప్పుడు ఆ బ్రాంచీల్లో సీట్లు అధికంగా మిగిలిపోయాయి. గత ఏడాది ఆ బ్రాంచీల్లో 1,700 మాత్రమే మిగిలిపోగా... ఈసారి ఆ సంఖ్య 4,133 ఉండటం గమనార్హం.

■ సీఎస్ఈ బ్రాంచీలో 2025 తొలి విడతలో 28,246 సీట్లుండగా.. 27,677(97.98శాతం) మందికి సీట్లు దక్కాయి. అదే చివరి విడత నాటికి సీఎస్ఈ సీట్లు 30,655కు పెరిగాయి. సీట్ల కేటాయింపు 29,488కి పెరిగింది. అంటే 96.19 శాతంతో సమానం. ఈసారి తొలి విడతలో 95 శాతం సీట్లే నిండాయి. అంటే గత ఏడాది తొలి, తుది విడతలతో పోల్చుకుంటే సీట్ల భర్తీ శాతం తగ్గింది. మిగిలిన పలు కంప్యూటర్ సంబంధిత బ్రాంచీల పరిస్థితి కూడా అదే మాదిరిగా ఉండటం గమనార్హం.

■ కోర్ బ్రాంచీల్లో ఈసీఈ, ఈఈఈలో కేటాయించిన సీట్ల సంఖ్య స్వల్పంగా తగ్గింది. సివిల్, మెకానికల్‌లో స్వల్పంగా పెరిగింది.

కొన్ని ప్రముఖ కళాశాలల వారీగా ప్రారంభ ర్యాంకు

కళాశాల	ప్రారంభ ర్యాంకు
సీబీఐటీ	1
జేఎన్‌టీయూహెచ్	22
వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి	149
ఓయూ	420(ఈసీఈ)
వాసవి	511
నారాయణమ్మ	783

(గమనిక: మిగిలిన ర్యాంకర్లు సీఎస్ఈ బ్రాంచీల్లో చేరారు)

సెయింట్ పీటర్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- హాజరైన జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ ప్రొఫెసర్ ఎ. దామోదరం

నవతెలంగాణ-మేడ్చల్

విద్యార్థులు విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో,నైతిక విలువలను పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ ప్రొఫెసర్ ఎ. దామోదరం తెలిపారు.మైసమ్మ గూడ లోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 16వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ ప్రొఫెసర్ ఎ.దామోదరం , తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. నితిన్ కుమార్ రెడ్డి హాజరై పట్టభద్రులకు కళాశాల విద్యార్థులకి గ్రాడ్యుయేషన్ డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం రెక్టర్ ప్రొఫెసర్ మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలను పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడే ఇంజినీర్లుగా ఎదగాలని సూచించారు. భవిష్యత్ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, నిరంతర అధ్యయనం ఆవిష్కరణల ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.టాస్క్ సీఈఓ మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, టాస్క్ అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటరావు వార్షిక నివేదికను సమర్పిస్తూ, గత ఏడాదిలో విద్యా, సాంకేతిక, పరిశోధన, ప్లేస్‌మెంట్లు, క్రీడా రంగాల్లో కళాశాల సాధించిన విశేష విజయాలను వివరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.అనంతరం పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేసి, విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ టి.బాలా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.విజయ్‌పాల్ రెడ్డి,అకడమిక్ డైరెక్టర్ టి. సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ టి.అనురాగ్ రెడ్డి, సెయింట్ పీటర్స్ హై స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అల్ఫోన్స్ రెడ్డి, కళాశాల పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ రవి సుధాకర్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల మౌలిక వసతులకు ప్రాధాన్యం: మంత్రి దామోదర్

సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ కళాశాలలో బస్సును ప్రారంభిస్తున్న మంత్రి..

జోగిపేట, వట్‌పల్లి, న్యూస్‌టుడే: విద్యార్థుల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. శనివారం చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు నూతన బస్సులు, స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన రవాణా సౌకర్యం, ఆధునిక వసతులు కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ కిషన్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, కళాశాల ప్రిన్సిపల్ విశ్వనాథ రాజు, అందోలు ఆర్డీవో రమేశ్ బాబు, ఫెడ్కాన్ మాజీ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మండల కేంద్రమైన వట్‌పల్లిలో రాణా, మండల ప్రజా పరిషత్తు, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి వ్యవసాయ విపణి ఆవరణలోని స్థలాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. రూ.11.20కోట్ల నిధులతో నిర్మాణ దశలో ఉన్న 30పడకల సీహెచ్‌సీని పరిశీలించారు. అనంతరం చౌటకూరు, అందోలు, జోగిపేటలో 'సర్'పై నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఓట్లు కోల్పోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జేఎన్టీయూలో ప్రపంచ స్థాయి సదుపాయాలు

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

పుల్‌కల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ, సాంకేతికశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాలకు తోషిబా పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల కింద అందజేసిన బస్సులను శనివారం ఆయన ప్రారంభించారు. బస్సుల్లోనే ప్రయాణించి ఫార్మసీ కళాశాలకు చేరుకుని స్మార్ట్ కంప్యూటింగ్ లేబొరేటరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుల్తాన్‌పూర్ క్యాంపస్ స్వల్పకాలంలోనే ఎంతో అభివృద్ధి సాధించిందని ప్రశంసించారు. అత్యాధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ, పరిశోధన, ఆవిష్కరణలకు అవకాశాలు కల్పిస్తామన్నారు. జేఎన్టీయూ ఆవరణలో క్లాక్‌టవర్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీవో రమేశ్‌బాబు, తహసీల్దార్ నామాల కిష్టయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విశ్వనాథరాజు, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్ రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● 'సర్' సర్వేపై చౌటకూరు శివారులో పుల్కల్, చౌటకూర్, అందోలు మండలాల కాంగ్రెస్ బీఎల్ఏలతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను నింపేందుకు ఓటర్లకు సహకరించాలని పార్టీ బీఎల్ఏలు, నాయకులకు సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు భూంరెడ్డి, సుభాష్‌రెడ్డి, శేరి జగన్‌మోహన్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, ఆత్మ చైర్మన్ మల్లారెడ్డి, సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, గణేష్, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, లక్ష్మయ్య, రామాగౌడ్, సంగమేశ్వర్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సర్'పై అప్రమత్తంగా ఉండండి

మాట్లాడుతున్న మంత్రి దామోదర్

అల్లాదుర్గం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో కాంగ్రెస్ బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులతో శనివారం అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు పోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలను సరైన పద్ధతిలో పూరించేందుకు ఓటర్లకు సహకరించాలని ఆదేశించారు. బూతుల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ఫారం నింపేలా చూడాలని, ఈ నెల 24 వరకు ప్రక్రియ వంద శాతం పూర్తిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రాజీవ్, అల్లాదుర్గం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేషారెడ్డి పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో 'సీఎస్ఐ` వార్షిక పురస్కారాలు

- కళాశాల వేదికగా అట్టహాసంగా వేడుక
- విద్యార్థులు ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

నవతెలంగాణ-మేడ్చల్

విద్యార్థులు ఏ ఐ సాంకేతికతని అందిపుచ్చుకోవాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ వీసీ ప్రొఫెసర్. ఎ. గోవర్ధన్ తెలిపారు.మైసమ్మ గూడ లోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వేదిక గా శనివారం సీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ వార్షిక ప్రతిభ అవార్డులు 2026 ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ సీనియర్ ప్రొఫెసర్, సీఎస్ఈ & డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్ అండ్ ప్లానింగ్ (డ్యాప్) ప్రొఫెసర్.వి.కామాక్షి ప్రసాద్ తో కలిసి ఆయన హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ సాంకేతికత అనేది కేవలం కోడింగ్ లేదా సాఫ్ట్‌వేర్ రాయడం మాత్రమే కాదని, అది ఒక సామాజిక సమస్యకు పరిష్కారం చూపించే అద్భుతమైన సాధనమని తెలిపారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి టెక్నాలజీలు మన జీవితాలను వేగంగా మారుస్తున్నాయని, మన తెలుగు రాష్ట్రాలలోని విద్యార్థులు, విద్యాసంస్థలు ఈ మార్పులను అందిపుచ్చుకోవడంలో ముందుండటం గర్వకారణమని, విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారిని గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దడంలో సీఎస్ఐ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కేవలం టెక్నాలజీని నేర్చుకోవడమే కాదని , దాన్ని వ్యవసాయం, వైద్యం, గ్రామీణ వికాసానికి ఎలా ఉపయోగించాలో ఆలోచించాలని మీ ఆలోచనలే రేపటి ఆవిష్కరణలని తెలిపారు . జేఎన్‌టీయూహెచ్ సీనియర్ ప్రొఫెసర్ మాట్లాడుతూ విద్యాబోధన అంటే కేవలం పుస్తకాల్లోని జ్ఞానాన్ని పరీక్షల పేపర్ల మీద పెట్టడం కాదని, అది విద్యార్థిలో ఆలోచనా శక్తిని, ప్రశ్నించే తత్వాన్ని పెంచడమని, ఈ ఆధునిక కాలంలో కేవలం సిద్ధాంతాలు చదవడం సరిపోదని, విద్యాసంస్థలు ఐటీ పరిశ్రమల మధ్య అనుసంధానం చాలా ముఖ్యమని, మన విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకునే సాంకేతికతను, సమాజంలోని నిజమైన సమస్యలను పరిష్కరించడానికి అన్వయించగలగాలని తెలియచేశారు.

ఈ సందర్భంగా సీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డా. ఎ. వి. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, గత ఏడాది సీఎస్ఐ హైదరాబాద్ ద్వారా నిర్వహించిన పలు కార్యక్రమాల వార్షిక నివేదిక ను తెలియచేశారు.ఇదే వేదిక పై ఏఐ అండ్ డిజిటల్ టెక్నాలజీస్‌తో కోర్ ఇంజినీరింగ్‌ను పునర్నిర్మించడం అనే అంశం పై ఉన్నత స్థాయి ప్యానెల్ డిస్కషన్ ను నిర్వహించారు. ఈ చర్చ , సీనియర్ ప్రొఫెసర్ , జెఎన్టీయూహెచ్ మాజీ డైరెక్టర్, అర్బి యూ కేటీ ఆర్ కె వ్యాలీ డా. ఏ వి ఎస్ ఏస్ కుమార స్వామి గుప్తా , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అన్నవరపుల రామకృష్ణ , ప్రొఫెసర్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ , ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ బి ఉమాశంకర్ , వీపీ సేల్స్ , సరోయి ఇంచార్జి అమెరికా జి కే చైతన్య మధ్య జరిగింది. వాటి సారాంశం: మారుతున్న కాలంతో పాటు టెక్నాలజీ మారడం కాదు, టెక్నాలజీతో పాటే మనం కూడా మన ఆలోచనా విధానాన్ని మార్చుకోవడమే నిజమైన ఇంజినీరింగ్ అని వెలిబుచ్చారు. ప్రస్తుతం ఇండస్ట్రీ కేవలం ఒకే రంగానికి పరిమితమైన జ్ఞానాన్ని కోరుకోవట్లేదని, సివిల్, మెకానికల్ చదివే విద్యార్థి కూడా ఏఐ డిజిటల్ టూల్స్ వాడకంలో నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్యానెల్ మెంబెర్స్ అభిప్రాయపడ్డారు. మిక్కిలినేని రవి ప్రకాశ్ మెమోరియల్ వారి ఆధ్వర్యంలో హ్యాకథాన్ కూడా నిర్వహించడం విశేషం. ఇందులో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు ప్రదానం చేశారు.

అనంతరం కళాశాల కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ, సీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ వార్షిక ప్రతిభ అవార్డులకు తమ కళాశాల వేదిక అవ్వడం ఎంతో గర్వకారణమని, అందున తమ కళాశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూడా ఈ అవార్డులలో స్థానం దక్కడం మరింత ఆనందాన్నిస్తోంది తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించడం లో సీఎస్ఐ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ లోకానాథం మాట్లాడుతు, ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. సాంకేతికతను ఎలా వినియోగించాలో, విద్యార్థులకు తెలియచేస్తూ, వారిలోని ప్రతిభను వెలికి తీస్తున్న సీఎస్ఐ సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ఏడాది 19 విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన వారికి 75 అవార్డులు సిఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ వారు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు సీఎస్ఐ ఇండియా నుండి కంచిభొట్ల రాజు , ఇమ్మిడియేట్ పాస్ట్ చైర్మన్ సి. సుధాకర్, సీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డా. ఎ. వి. కృష్ణ ప్రసాద్, వైస్ చైర్మన్ డా. ఏ. రామకృష్ణ ప్రసాద్, కార్యదర్శి డా.డి.వి. రమణ, కళాశాల చైర్మన్ జె నర్సింహారెడ్డి, కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి , కోశాధికారి జె త్రిలోక్ రెడ్డి , డైరెక్టర్ డా ఏ మోహన్ , కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ లోకానాథం గారు, కార్యక్రమ సమన్వయకర్త డా. పి దిలీప్ కుమార్ రెడ్డి గారు, ఏఐఎంఎల్ విభాగాధిపతి ప్రొ. వరప్రసాద్,డా. ఎస్. శ్రీనివాస్ రావు ప్రొ. శ్రీలక్ష్మి , కిరణ్మయి, శాలిని, కవిత పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానిస్తున్న ప్రొఫెసర్ నరసింహులు

టీజీ ఈఏపీసెట్‌లో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

నార్సింగ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల విద్యార్థులు టీజీ ఈఏపీసెట్-2026లో రాష్ట్రంలో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. దీంతో సీబీఐటీ యాజమాన్యం విద్యార్థుల ప్రతిభపై హర్షం వ్యక్తం చేశారు. దూరదృష్టి కలిగిన డైనమిక్ నాయకత్వం, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం, అంకితభావంతో పనిచేస్తున్న అధ్యాపక బృందాలకు ప్రొఫెసర్ సి.వి.నరసింహులు అభినందనలు తెలిపారు.

జేఎన్‌టీయూలో స్మార్ట్ కంప్యూటింగ్ ల్యాబ్

ప్రారంభించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.. తోషిబా సంస్థ అందజేసిన రెండు బస్సులు ప్రారంభం

కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కొత్తగా స్మార్ట్ కంప్యూటింగ్ లాబొరేటరీని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. శనివారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్, సిమ్యులేషన్ లాబొరేటరీతో పాటు, తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) చొరవ కింద ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల కోసం అందించిన రెండు కొత్త బస్సులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ.. సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ క్యాంపస్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కళాశాల ప్రాంగణంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, నాణ్యమైన సాంకేతిక విద్యను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణమైన మద్దతు అందిస్తున్నామని చెప్పారు. వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తోషిబా సంస్థ సీఎస్ఆర్ కింద అందించిన విరాళానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన, ఆవిష్కరణల ప్రోత్సాహం, భవిష్యత్ సాంకేతికతలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడం కోసం ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని వీసీ పేర్కొన్నారు. కొత్త బస్సులు హైదరాబాద్ క్యాంపస్ నుంచి సుల్తాన్‌పూర్‌లోని ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలలకు వచ్చే విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణాను అందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ విశ్వనాధ రాజు, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ సునీతారెడ్డి, వైస్-ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ ఎం.శైలజ, శ్వేత, విద్యావతి, రాజేష్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యాభివృద్ధికి పెద్దపీట

- మంత్రి దామోదర రాజనర్సింహ
- జేఎన్టీయూహెచ్ కళాశాల నూతన బస్సులు ప్రారంభం

నవతెలంగాణ-చౌటకూర్

తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఆధునిక ప్రయోగశాలలు, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలకు నిరంతర సహకారం అందిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శనివారం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నూతన బస్సులు, అత్యాధునిక ప్రయోగశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పాల్గొని వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుల్తాన్‌పూర్ క్యాంపస్ తక్కువ కాలంలో సాధించిన అభివృద్ధిని మంత్రి ప్రశంసిస్తూ పలు సూచనలు చేశారు. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించబోయే క్లాక్ టవర్ గురించి స్థల పరిశీలన చేశారు. క్లాక్ టవర్ కన్‌స్ట్రక్షన్ గురించి దాని ఎస్టిమేషన్, దాని స్ట్రక్చర్ తయారు చేసి పెట్టమని ఆదేశించారు. క్లాక్ టవర్ కళాశాల ఆవరణకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. అనంతరం జేఎన్‌టీయూ హెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి అందిస్తున్న నిరంతర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యంతోనే ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యను అందించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, అందోల్ ఆర్డిఓ రమేష్‌బాబు, చౌటకూర్ తహసీల్దార్ నామాల కిష్టయ్య, నయాబ్ తహసీల్దార్ అనుదీప్, ఆర్ఐ ప్రమోద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మెన్ జగన్మోహన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ మల్లారెడ్డి, సుల్తాన్‌పూర్ గ్రామ సర్పంచ్ చంటి గీతారాణి రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, అధ్యాపక బృందం, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.